క్లుప్తంగా

గ్రంథాలయంలో ఆటల పోటీలు



ఆటల పోటీలు ఆడుతున్న చిన్నారులు

చిన్నమండెం : వేసవి శిబిరంలో భాగంగా సోమవారం చిన్నమండెం మండల కేంద్రంలోని గ్రంథాలయంలో క్యారం, చెస్, కుర్చీ ఆటల పోటీలు నిర్వహించినట్లు గ్రంథ పాలకుడు ఆంజనేయులురెడ్డి తెలిపారు. పుస్తక ప్రదర్శనతోపాటు నీతి కథలు, గ్రామర్, జనరల్ నాలెడ్జ్ బుక్స్ చదవడం వల్ల పిల్లల్లో మేధాశక్తి పెంచుకోవచ్చని తెలిపారు. ఆటల పోటీలలో గెలుపొందిన వారికి వేసవి శిబిరం ముగింపు అనగా జూన్ 7వ తేదీన బహుమతులు ప్రదానం చేస్తామని తెలియజేశారు. సమ్మర్ క్యాంప్ ప్రోగ్రాంలో భాగంగా విద్యార్థులకు బిస్కెట్లు, స్నాక్స్ పంపిణీ చేసినట్లు గ్రంథ పాలకుడు చెప్పారు.

సర్వే పరిశీలన



సర్వేలో పాల్గొన్న ఎంఈఓ శంకరయ్య

సిద్దవటం : మే 1వ తేదీ నుంచి జూన్ 9వ తేదీ వరకు సర్వే ద్వారా ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించి వారిని భవిత కేంద్రంలో చేరిస్తున్నట్లు సమ్మిళిత విద్య ఉపాధ్యాయురాలు పద్మావతి తెలిపారు. మండల కేంద్రంలో సోమవారం ఇంటింటికి తిరిగి ప్రత్యేక అవసరాలు గల పిల్లలను సర్వే ద్వారా గుర్తించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి శంకరయ్య సర్వేను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సర్వే ద్వారా ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలను గుర్తించి వారికి ప్రభుత్వం అందించే పెన్షన్, ఉపకరణాల గురించి తల్లిదండ్రులకు వివరించామన్నారు. అలాగే భవిత కేంద్రంలో పిల్లలకు నిర్వహించే ఫిజియోథెరఫీ, బోధన, బోధనేతర అంశాలను ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీలు పాల్గొన్నారు.

ఘనంగా వసంతోత్సవం



రేణుకా యల్లమాంబ వసంతోత్సవంలో పాల్గొన్న గ్రామస్తులు

సిద్దవటం : మండలంలోని మాచుపల్లె గ్రామంలో శ్రీ రేణుకా యల్లమాంబ తిరునాల చివరి రోజు సోమవారం వసంతోత్సవం వేడుకలు స్థానిక ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రేణుకా యల్లమాంబ ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో ఉంచి గ్రామంలో ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారి పల్లకీ ఇళ్ల వద్దకు రాగానే మహిళలు అమ్మవారికి కాయాకర్పూరాలు సమర్పించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఊరేగింపు వెంబడి మహిళలు, యువకులు, పిల్లలు, పెద్దలు ఒకరిపై ఒకరు వసంతాలు చల్లుకున్నారు. ఉత్సవాన్ని ఉల్లాసంగా, ఉత్సాహంగా నిర్వహించారు.

ఘనంగా ప్రారంభమైన మడితాడు జాతర



ప్రత్యేక అలంకరణలో అమ్మవార్లు

సుండుపల్లె : మండలంలోని మడితాడు గ్రామ దేవత మడితాడు అమ్మ (చిన్నక్కమ్మ, పెద్దక్కమ్మ)ల జాతర ఘనంగా ప్రారంభమైంది. సోమవారం ఉదయం తొలి బోనం పట్టడం అయిన తరువాత పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం చిన్నక్కమ్మ, పెద్దక్కమ్మల అమ్మవార్లు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రికి చాందినీ బండ్లు, విద్యుత్ అలంకరణతో ఘనంగా జాతర ఘనంగా జరిగింది. జాతరలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనడంతో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

ఆత్మీయ విందులో మాజీ ఎమ్మెల్యే



విందులో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మోహన్‌రెడ్డి

రామాపురం : మండలంలోని చిట్లూర్లు గ్రామం ఏకిలపల్లెకు చెందిన సదిపిరాళ్ల రాంబసిరెడ్డి సోమవారం ఇచ్చిన ఆత్మీయ విందుకు లక్కిరెడ్డిపల్లె మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్ రెడ్డి హాజరయ్యారు. ఆయనతోపాటు సర్పంచ్ రామాంజనేయులు, ఆదిరెడ్డి, హరినాథరెడ్డి, శంకర్‌రెడ్డి, అమరనాథరెడ్డి, నాగేంద్రరెడ్డి, విశ్వనాథరెడ్డి, చలమారెడ్డి, నారాయణరెడ్డి, నరసింహులు, వెంకటరమణ, భద్రయ్య తదితరులు విందులో పాల్గొన్నారు.

ఆడబిడ్డలను కాపాడాల్సిన బాధ్యత అందరిదీ



సమావేశంలో మాట్లాడుతున్న డెమో ఆఫీసర్ దేవ శిరోమణి

వీరబల్లి : ప్రస్తుత సమాజంలో స్త్రీ, పురుష నిష్పత్తి సమానంగా ఉండేలా చూసే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని డీఎం అండ్ హెచ్ఓ కార్యాలయం డెమో ఆఫీసర్ దేవ శిరోమణి తెలిపారు. సోమవారం ఆమె మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ లింగ నిర్ధారణ వ్యతిరేక చట్టం గురించి వివరించారు. ముఖ్యంగా గర్భంతో ఉన్న స్త్రీలు లింగ నిర్ధారణ పరీక్షలు చేయించుకోరాదన్నారు. అలా చేయించుకోవడం నేరమన్నారు. అలాగే సాధారణ ప్రసవాలు గురించి వివరించారు. స్త్రీ, పురుష నిష్పత్తి సమానంగా లేకుంటే జరిగే అనర్థాలు, ఆడపిల్లల ప్రాముఖ్యత, అలాగే లింగ నిర్ధారణ పరీక్షలు చేసేవారికి వేసే శిక్షలు గురించి వివరించారు. ఆడబిడ్డలను కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అనవసరంగా సిజేరియన్ ఆపరేషన్ చేయించుకోవడం వల్ల వచ్చే ఇబ్బందులు గురించి అవగాహన కల్పించాలన్నారు. సాధారణ ప్రసవాల వలన తల్లీబిడ్డల ఆరోగ్య పరిస్థితి బాగుంటుందని తెలిపారు. సిజేరియన్ ఆపరేషన్ చేయించుకునే తల్లులకు దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, డబ్బులు కూడా వృథా అవుతాయని, కావున అత్యవసర పరిస్థితులలో తప్పా సహజంగా సిజేరియన్ ఆపరేషన్ చేయించుకోకూడదని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులలో ఎక్కువగా సాధారణ కాన్పులు జరుగుతాయని, కావున ప్రభుత్వ ఆసుపత్రులలోనే కాన్పులు చేయించుకోవాలని గర్భిణులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ తేజశ్వనీ, సీహెచ్ఓ సుధాకర్, హెచ్ఈ ఉషారాణి, పీహెచ్ఎన్ గంగులమ్మ, సూపర్‌వైజర్ సరోజ, శివయ్య, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

రాజంపేట : స్థానిక ఆర్టీసీ డిపో కార్యాలయంలో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజరు రమణయ్య తెలిపారు. ప్రయాణీకులు ఆర్టీసీ చేపట్టిన కార్యక్రమానికి సహకరించాలని కోరారు. ఆర్టీసీ పరమైన సమస్యలు ఏవైనా ఉంటే డయల్ యువర్ డీఎంలో ప్రస్తావించవచ్చునన్నారు. 9959225775 నంబరును సంప్రదించాలని కోరారు.

విద్యతోనే అన్ని రంగాల్లో రాణింపు



విద్యార్థులకు అందజేస్తున్న దృశ్యం

నందలూరు : ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు కష్టపడి, చిత్తశుద్ధితో ప్రణాళికాబద్ధంగా చదివితేనే అన్ని రంగాలలో రాణిస్తారని కళాబంధు చిక్కాల బాలాజీరావు తెలిపారు. ప్రముఖ రంగస్థల నటులు, కళాబంధు చిక్కాల బాలాజీరావు సతీమణి దివంగత చిక్కాల జయలక్ష్మీ స్మారకార్థం మండలస్థాయిలో ప్రతిభ చూపిన పది, ఇంటర్మీడియట్ విద్యార్థులకు నగదు పురస్కారాలను ఐదువేలు రూపాయల చొప్పున అందజేశారు. స్థానిక నందలూరు గ్రంథాలయంలో సోమవారం ఉదయం ఎస్టీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అల్లం అశోక్ కుమార్ అధ్యక్షతన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పదో తరగతి పరీక్షలలో అత్యున్నత మార్కులు 572/600 సాధించిన టంగుటూరు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థిని గాదెన హేమలత, మండలంలోని మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ బాలికల గురుకుల పాఠశాలలో ఇంటర్ ఎంపీసీలో 962/1000 మార్కులు సాధించిన విద్యార్థిని ఆర్.విజయ హాసినీలకు చిక్కాల బాలాజీరావు, అల్లం అశోక్ కుమార్‌ల చేతుల మీదుగా నగదు అవార్డులను అందజేశారు. అనంతరం ఎస్టీయూ నాయకులు చిక్కాల బాలాజీరావును పట్టు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు మోహన్ రాజు, లీలా కృష్ణయ్య, భరత్ కుమార్, జేవీ రమణ, చలపాటి నరసింహారావు, వెంకటేశ్వరరావు, రెడ్డన్న, యూటీఎఫ్ నాయకులు హరినాథ్, కృపానందం, బీసీ గురుకుల పాఠశాల ప్రతినిధి ప్రశాంత్, ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయులు వెంకటసుబ్బయ్య, ఎంఆర్పీఎస్ అటెండర్ల సంఘం జిల్లా అధ్యక్షులు హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో ఫ్లాగ్ మార్చ్



చిట్వేలిలో కవాతు చేస్తున్న పోలీసులు

చిట్వేలి : ఓట్ల లెక్కింపును పురస్కరించుకొని మండలంలోని పలు గ్రామాలలో ముందస్తు చర్యల్లో భాగంగా ఫ్లాగ్ మార్చ్ (కవాతు) నిర్వహించినట్లు ఎస్ఐ సుధాకర్ తెలియజేశారు. ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు మండలంలోని చిట్వేలి, సి.కందులవారిపల్లి, మిట్టపల్లి, తుమ్మచెట్లపల్లి, రంపావారిపల్లి గ్రామాలలో సోమవారం బీఎస్ఎఫ్ దళాలతో ఫ్లాగ్ మార్చ్ చేపట్టినట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు. కౌంటింగ్ దగ్గరపడుతున్న నేపథ్యంలో గ్రామాల్లో ప్రశాంత వాతావరణానికి ఎవరు విఘాతం కలిగించిన కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వంట మాస్టర్లకు ఒక రోజు శిక్షణ



వంట మాస్టర్లకు బహుమతులు అందజేస్తున్న డీఈఓ శివప్రకాష్‌రెడ్డి, అధికారులు

రాయచోటి టౌన్ : వివిధ ప్రభుత్వ పాఠశాలలో వంట మాస్టర్లు, సహాయకులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సోమవారం అన్నమయ్య జిల్లా కేంద్రంలో జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో రాయచోటి డివిజన్ స్థాయిలో ఉన్న అన్ని పాఠశాలలకు చెందిన వర్కర్లు, సహాయకులకు పాఠశాలలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన నిర్వహణ, వండే విధానాలపై ఈ శిక్షణ ఏర్పాటు చేసినట్లు డీఈఓ శివప్రకాష్ రెడ్డి తెలిపారు. విద్యార్థులకు మంచి నాణ్యతతో కూడిన భోజనంతోపాటు రుచికరంగా అందించాలని సూచించారు. మొత్తం 138 మంది వంట మాస్టర్లు, వారి సహాయకులు పాల్గొన్నారు. అనంతరం వంట మాస్టర్లకు వంట పోటీలు నిర్వహించి రుచికరంగా వండిన వారికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కో-ఆర్డినేటర్ రవీంద్ర నాయక్, ఎంఈఓ వెంకట శివారెడ్డి, స్టేట్ రీసోర్స్ పర్సన్ ఏ.నాగలక్ష్మమ్మ, సీఆర్పీలు పాల్గొన్నారు.

సామాజిక సేవలకు గుర్తింపు



చిన్నజీయర్ చేతులమీదుగా బహుమతి అందుకుంటున్న వినయ్‌కుమార్

రాయచోటి టౌన్ : సమాజ సేవలకు గుర్తింపుగా చిన్నజీయర్ స్వామి చేతులమీదుగా బహుమతులు అందాయని డాక్టర్ అబ్దుల్ కలాం యువ కెరటం ట్రస్టు డైరెక్టర్ వినయ్‌కుమార్ అన్నారు. సోమవారం తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌లో స్టాచ్యూ ఆఫ్ ఈక్వాలిటీ ఆధ్వర్యంలో మాతృ దినోత్సవ వేడుకలలో అన్నమయ్య జిల్లా నుంచి వినయ్ కుమార్‌కు బహుమతి అందించారు. ఈ సందర్భంగా వినయ్ మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా భారతీయ సంప్రదాయాలను ప్రోత్సహిస్తూ నిర్వహించిన అనేక కార్యక్రమాలను నిర్వహణపాటు సామాజిక సేవలకు గుర్తింపుగా ఈ బహుమతి అందించారన్నారు.

సేవల విస్తరణకు సహకరించండి



సమావేశంలో పాల్గొన్న మానవత సభ్యులు

చిట్వేలి : సమాజ శాంతి కోసం మానవతను బలోపేతం చేయడానికి సభ్యులు సేవల విస్తరణకు సహకారం అందజేయాలని పలువురు మానవత సభ్యులు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం స్థానిక సాయి వికాస్ పాఠశాలలో మానవత నెలవారీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ గ్రామాలలో శాంతి స్థాపన కోసం మానవత సేవా సంస్థలో ప్రతి గ్రామంలోని యువకులు సభ్యులుగా చేర్చాలన్నారు. తద్వారా గ్రామాల్లో సేవ గుణాన్ని చాటుతూ సమాజ శ్రేయస్సులవుతారన్నారు. సభ్యత్వాలను మరింత బలోపేతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ సురేంద్రారెడ్డి, అధ్యక్షులు సాయిరాం, కార్యదర్శి మునిరావు, గౌరవ డైరెక్టర్ బోర్డు సభ్యులు తిరుమల విశ్వనాథం, వీరాంజనేయరాజు, శ్రీనివాసులు రెడ్డి, సుబ్రమణ్యం రెడ్డి, రోళ్ల మోహన్, భద్రయ్య, సుధీర్ రెడ్డి, టీచర్ కాలేషా, పరదేశి పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో సాదిక్ వలీ ఉరుసు



ఉరుసు మహోత్సవానికి ముస్తాబైన దర్గా

చిట్వేలి : మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతూ భక్తుల కోర్కెలు తీర్చే దైవంగా ఎంతో పేరుగాంచిన సాదక్ వలీ ఉరుసు మహోత్సవాలు చిట్వేలిలో అత్యంత వైభవంగా సోమవారం మొదలయ్యాయి. ఈ సందర్భంగా రంగవల్లులతో, విద్యుత్ కాంతులతో దర్గాను అలంకరించారు. మండల కేంద్రంలో వెలసివున్న శ్రీ హజరత్ జనాబ్ సయ్యద్ షా సాదక్ వలీ ఉరుసును ఘనంగా నిర్వహిస్తున్నట్లు పీఠాధిపతి సయ్యద్ జిలానీ బాషా హుస్సేని తెలియజేశారు. సోమవారం గంధం, నేడు మంగళవారం ఉరుసు మహోత్సవం జరుగుతుందని వారు తెలిపారు. హిందువు, ముస్లిం సోదరులు ఈ ఉరుసు మహోత్సవంలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

రాజంపేట స్టేషన్ మేనేజర్ మృతి



నివాళి అర్పించిన రైల్వే మజ్దూర్ యూనియన్ నేతలు, రైల్వే ఉద్యోగులు

రాజంపేట : రాజంపేట స్టేషన్ మేనేజర్, నందలూరు సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ కోశాధికారి వెంకటసుబ్బయ్య(58) ఆదివారం మృతి చెందారు. అదే రోజు సాయంత్రం ఆయనకు నందలూరు యూనియన్ బ్రాంచి నేతలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మజ్దూర్ యూనియన్ చైర్మన్ గోపినాథ్, సెక్రటరీ కె.విశ్వనాథ్ మాట్లాడుతూ నందలూరు యూనియన్ గొప్ప కార్మిక నేతను కోల్పోయిందన్నారు. వెంకటసుబ్బయ్య మృతి మజ్దూర్ యూనియన్‌కు తీరని లోటన్నారు. ఆయన మృతికి తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నామన్నారు. ఆయన కుటుంబానికి సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో యూనియన్ నేతలు ఎస్ఎం బాషా, బి.సిద్దయ్య, ప్రకాశం, యశ్వంత్, నారాయణ, గౌస్, రిటైర్డ్ మజ్దూర్ యూనియన్ నేతలు సెక్రటరీ గిద్దలూరు శ్రీనివాసులు, ఎ.పరమేశ్వరరాజు, ఆర్.నాగేశ్వరరావు, మాజీ చైర్మన్ వెంకటయ్యలు నివాళి అర్పించిన వారిలో ఉన్నారు. స్టేషన్ మేనేజరు వెంకటసుబ్బయ్యకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తెలు ఉన్నారు. కాగా వెంకటసుబ్బయ్య నందలూరు రైల్వేకేంద్రంలో స్టేషన్ మేనేజరుగా పనిచేశారు. దీంతో ఆయన మృతి అటు స్టేషన్ సిబ్బంది, ఇటు యూనియన్ వర్గాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. విధి నిర్వహణలో ఆయన చేసిన సేవలను పలువురు గుర్తు చేసుకున్నారు.

ఆదమరిస్తే అంతే సంగతులు



రహదారిపై ఏర్పడ్డ గుంతలు

ఓబులవారిపల్లె : మండల కేంద్రం నుంచి చిన్నఓరంపాడు క్రాస్‌రోడ్డు వెళ్లే ప్రధాన రహదారి పొడువునా పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ప్రతి నిత్యం ఈ రహదారి మండల కేంద్రానికి ఇతర గ్రామీణ ప్రాంతాలకు వెళ్లి వచ్చే వాహనాలతో రద్దీగా ఉంటుంది. అయితే పాములేరు బ్రిడ్జి సమీపంలో పున్న టివారిపల్లె వరకు రహదారి గుంతలమయం అయ్యింది. దీంతో ఈ మార్గం గుండా ప్రయాణించే వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. చాలా రోజుల నుంచి అధికారులు గుంతలు పూడ్చకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయంలో ఆదమరిస్తే వాహనాలు ప్రమాదాలకు గురై ప్రమాణలు కోల్పోయే అవకాశం ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు వేయించాలని లేనిపక్షంలో కనీసం గుంతలైనా పూడ్చాలని ప్రజలు కోరుకుంటున్నారు.

ఖరీఫ్‌కు సమాయత్తమవుతున్న రైతులు

రామాపురం : ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతుండటంతో రైతులు తమ వ్యవసాయ పొలాల్లో గడ్డి, పిచ్చి మొక్కలను తొలగించడం, దుక్కులు, దున్నులు చేసుకోవడంలో బిజీ బిజీగా ఉన్నారు. అందునా వర్షాలు ఓ మోస్తారు కురవడంతో భూముల్లో చెమ్మ పదును ఉండడంతో దుక్కులకు సమాయత్తమవుతున్నారు. ఇది ఇలా ఉండగా గతంలో మాదిరి ఎడ్లు, నాగలి కాడ్యాలు కనుమరుగవుతుండటం, యంత్రీకరణగా ట్రాక్టర్లు ఉపయోగం బాగా పెరిగింది. ముందుగా అయితే బాగా ఉంటుందని, ఒక్కసారిగా పెరిగితే ట్రాక్టర్ల సేద్యాలకు రేట్లు కూడా పెరుగుతాయేమోనన్న అనుమానంగా కూడా ఉంది. ట్రాక్టర్లతో అయితే లోదుక్కులు అవుతాయని, లోపాటులో క్రిములు, పురుగులు కూడా నశిస్తాయన్నది రైతుల ఉద్దేశం. గత ఐదేళ్లుగా వేరుశనగ దిగుబడి ఉన్న రేటు లేదన్నది వాస్తవం. ఈ సీజన్‌కు గాను వేరుశనగ వంగడాలు పలు రకాలు మంజూరుకావడంతో రైతులు వ్యవసాయ పనుల్లో తలామునకలయ్యారు.

90 శాతం సబ్సిడీతో ఎరువులు, విత్తనాలివ్వాలి

రాయచోటి అర్బన్ : అన్నమయ్య జిల్లాలోని రైతులందరికీ 90 శాతం సబ్సిడీతో కూడిన ఎరువులు, విత్తనాలు, మందులను ప్రభుత్వం ఇవ్వాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన రాయచోటి డిప్యూటీ తహసీల్దార్ రామాంజనేయులును కలసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని రైతులు గత ఏడాది కరువు, అకాల వర్షాలతో పంటలను నష్టపోయారన్నారు. ఈ విషయాన్ని గుర్తెరిగి రైతాంగానికి సబ్సిడీతో విత్తనాలు, ఎరువులు అందజేయాలన్నారు. ఇదే సమయంలో ప్రతి రైతుకు రూ.2లక్షల వరకు రుణమాఫీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఆయనతోపాటు రైతుసంఘం నేతలు రామచంద్రారెడ్డి, వెంకటేశు తదితరులు పాల్గొన్నారు.

అక్షర సేవకులు.. అవిశ్రాంత యోధులు

మదనపల్లె సిటీ: బడులకు సెలవులు ఇచ్చేశారు. స్నేహితులతో కాలక్షేపం చేద్దామంటే ఊళ్లకు, విహారయాత్రలకు చెక్కేశారు. పోనీ ఇరుగు పొరుగు పిల్లలతో ఆరు బయట ఆడుకుందామంటే ఎండలు మాడు పగలగొడుతున్నాయి. దాంతో ఏమీ తోచక సెలవు రోజులను నిస్సారంగా గడిపేస్తున్న పిల్లలకు ఆ దిగులు లేకుండా చేస్తున్నారు విశ్రాంత ఉద్యోగులు. ఉద్యోగ విరమణ చేసినా బోధనకు విశ్రాంతి లేదని చాటి చెబుతున్నారు. గత ఐదేళ్లుగా మదనపల్లె పట్టణం శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో ఉచితంగా పాఠాలు బోధిస్తున్నారు. దీనిపై 'సాక్షి' ప్రత్యేక కథనం. పిల్లలు హాయిగా నవ్వాలి. నవ్వుతూ ఆడుకోవాలి. ఆడుతూ నేర్చుకోవాలి. నేర్చుకుంటూ పైకి ఎదగాలి. ఇది శాఖ గ్రంథాలయంలోని వేసవి శిక్షణ శిబిరం ఉద్దేశం. ఇక్కడ ఏమి నేర్చుకున్నా, సంగీత సాధన చేసినా, నృత్యం చేసిన దాని ఉద్దేశం సెలవులను సరైన రీతిలో ఉపయోగించుకోవడమే. ఇప్పటికే వందకుపైగా పిల్లలు శిబిరంలో చేరి తమకు ఇష్టమైన అంశాలను నేర్చుకుంటున్నారు. 70 ఏళ్లు దాటినా ఇంకా చురుగ్గా పని చేస్తున్నారు.

సంప్రదాయ విలువలు వివరిస్తూ..



నా పేరు టీ.ఎస్.ఎ.క్రిష్ణమూర్తి. మున్సిపాలిటీలో క్లర్కుగా పదవీ విరమణ పొందా. నేను స్వతహాగా రచయితను. నేటితరం విద్యార్థుల్లో సనాతన సంప్రదాయ విలువలపై అవగాహన లేదని గ్రహించా. అదేవిధంగా తెలుగు భాషా నైపుణ్యం కూడా కొరవడుతోంది. ఈ నేపథ్యంలో ఆరేళ్లుగా విద్యార్థులకు ఆయా అంశాలపై శిక్షణ ఇస్తున్నా. ప్రధానంగా కథలు చెప్పడం వల్ల వారిలో చదువుపై ఆసక్తి పెరుగుతుంది. ఇతరులకు సేవ చేస్తే ఎనలేని తృప్తి లభిస్తుందని గ్రహించా.

ఆంగ్లభాషపై తర్ఫీదు



నా పేరు బి.రెడ్డప్ప. గ్యారంపల్లె ఏపీఆర్‌జెసిలో ఇంగ్లీషు అధ్యాపకుడిగా పని చేసి పదవీ విరమణ పొందా. గత మూడు సంవత్సరాలు నుంచి శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులకు స్వచ్ఛందంగా వచ్చి విద్యార్థులకు ఆంగ్లభాష పరిజ్ఞానంపై తర్ఫీదు ఇస్తున్నా. విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపుతూ పోటీ ప్రపంచంలో ఆంగ్లభాష ప్రాధాన్యాన్ని వివరిస్తున్నా. ప్రభుత్వ పాఠశాల్లోని పేద విద్యార్థులు ఆంగ్లంలో సులువుగా మాట్లాడేలా చేస్తున్నా. గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సాధన చేస్తున్న యువత ఏం చదవాలి..ఎలా చదవాలి .. వంటి అంశాలపై అవగాహన కల్పిస్తున్నా.

డ్రాయింగ్, తెలుగు నేర్పుతున్నా..

నా పేరు వీఎం నాగరాజు. ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పని చేసి పదవీ విరమణ పొందా. గత ఐదు సంవత్సరాలుగా శాఖ గ్రంథాలయంలో డ్రాయింగ్, తెలుగుపై తర్ఫీదు ఇస్తున్నా. చిన్నారులకు బొమ్మలంటే ఇష్టం. బొమ్మలు ఎలా గీయాలి అనే విషయాలు తెలియజేస్తున్నా. వారిలో కళాత్మకను తీసుకువస్తున్నా. బొమ్మలు వేయడం వల్ల విద్యార్థుల్లో ఏకాగ్రత పెరుగుతుంది. తెలుగులో నీతి కథలు చెప్పడం వల్ల విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుంది.

ఆరోగ్యవంతమైన సమాజం కోసం



నా పేరు శకుంతలమ్మ. మదనపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేసి పదవీ విరమణ పొందా. రోజురోజుకు మారుతున్న సమాజంలో ఆహారం, గాలి, నీరు, కలుషితమవుతోంది. ఇటువంటి సమాజానికి యోగా చాలా అవసరం. దీని ద్వారా రోగనిరోధకశక్తి పెంచుకోవచ్చు. దీని కోసం యోగా నేర్పిస్తున్నా. స్కౌట్స్,గైడ్స్ సేవలు వివరిస్తున్నా. సేవలు ఎలా చేయాలో తెలియజేస్తున్నా. దేశభక్తితో పాటు సామాజిక సేవలు వివరిస్తున్నా.

ఎంతో తృప్తిగా ఉంది



విశ్రాంత ఉద్యోగులు వచ్చి వేసవి శిక్షణా శిబిరంలో ఉచితంగా తరగతులకు హాజరు కావడం ఎంతో తృప్తిగా ఉంది. ప్రతి ఏడాది తామే ముందుకు వచ్చి బోధించడం సంతోషం. పిల్లల్లో మార్పు తీసుకురావడం కోసం, వేసవి సెలవులు విద్యార్థులు సద్వినియోగం చేసుకోవడం ఆనందంగా ఉంది.

-వసంతకుమారి, లైబ్రేరియన్, మదనపల్లె

రక్తదానం ప్రాణదానం లాంటిదే



రక్తదానం చేస్తున్న యువకుడు

రాయచోటి టౌన్ : రక్తదానం చేయడం అంటే ప్రాణదానం చేయడం లాంటిదేనని హెల్పింగ్ హ్యాండ్స్ బ్లడ్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు డాక్టర్ మైనుద్దీన్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో రాయచోటికి చెందిన సుమా అనే గర్భిణీ కాన్పు కోసం వెళ్లింది. ఆమెకు కాన్పు చేయడానికి (ఏ+) రక్తం కావాలని వైద్యులు సూచించారు. బాధితులు హెల్పింగ్ హ్యాండ్స్ వారిని సంప్రదించడంతో వారు వెంటనే స్పందించి ఆదిల్ అనే యువకుడితో రక్తం చేయించారు. తరువాత ఆమెకు సిజేరియన్ ద్వారా కాన్పు చేశారు. కార్యక్రమంలో పమీర్, బాబుల్లా, మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో ఉన్నత స్థాయికి..

మదనపల్లె సిటీ: విద్యార్థులు పట్టుదల ఉంటే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చునని మదనపల్లె తాలూకా సీఐ శేఖర్ అన్నారు. సోమవారం స్థానిక నిమ్మనపల్లె రోడ్డులోని జీఎంఆర్ పాలిటెక్నిక్ కాలేజీలో జాబ్ అచీవర్స్ డే నిర్వహించారు. సీ.ఐ మాట్లడుతూ ప్రతి విద్యార్థి అందివచ్చిన అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చదువులో రాణిస్తే మంచి ఉద్యోగాలు వస్తాయన్నారు. చదువును నిర్లక్ష్యం చూపవద్దని తెలిపారు. కాలేజీ ప్రిన్సిపాల్ ఓబులేసు మాట్లాడుతూ 2023-24 సంవత్సరంలో 10 కంపెనీలు సందర్శించాయన్నారు. 50 శాతం మంది విద్యార్థులు ప్రాంగణ నియామకాలకు ఎంపికైనట్లు తెలిపారు. ప్రాంగణ నియామకాలలో ఎంపికైన విద్యార్థులకు సీఐ ధృవపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.